# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి వారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు దర్శించుకున్నారు.

❖ భారత సాయుధ దళాలకు 2025 సంవత్సరానికిగానూ గ్యాలంటరీ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

❖ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) సంసిద్ధతపై ప్రధాన ఎన్నికల అధికారుల సదస్సు న్యూఢిల్లీలో ప్రారంభమయ్యింది.

❖ కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నత స్థాయి కమిటీ వివిధ అంశాలపై లడఖ్ నాయకులతో చర్చలు జరిపింది.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26న ప్రసారమవుతుంది.

====================

కేరళలోని శబరిమలపై కొలువుదీరిన అయ్యప్ప స్వామి వారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు దర్శించుకున్నారు. నాలుగు రోజుల కేరళ పర్యటనకు వెళ్ళిన రాష్ట్రపతి తిరువనంతపురం నుండి పథనంతిట్టకు వెళ్లి రోడ్డు మార్గంలో ఆలయానికి చేరుకున్నారు. శబరిమల అయ్యప్ప సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. శబరిమలకు వెళ్లే ముందు పంపా గణపతి ఆలయానికి చేరుకొని ఇరుముడిని కట్టడం తదితర సాంప్రదాయ ఆచారాలను పాటించారు.

====================

భారత సాయుధ దళాల అసాధారణ ధైర్యసాహసాలు, సేవలను గుర్తిస్తూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాలంటరీ పురస్కారాలను ప్రకటించింది. సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాల సిబ్బందికి 127 శౌర్య పురస్కారాలు, 40 విశిష్ట సేవా పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారని పేర్కొంటూ.. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఈరోజు విడుదల చేసింది. ఈజాబితా మేరకు నలుగురికి కీర్తి చక్ర, 15 మందికి వీర్ చక్ర, 16 శౌర్య చక్ర, 2 బార్ టు సేన పతకాలు (శౌర్య), 58 సేన పతకాలు (శౌర్య), 6 నవో సేన పతకాలు (శౌర్య), 26 వాయు సేన పతకాలు దక్కాయి. అదనంగా, 290 మెన్షన్-ఇన్-డిస్పాచ్‌లు ఆమోదించబడ్డాయి. మొత్తం 115 మంది భారత సైన్యం నుండి, 5 గురు నౌకాదళం నుండి, 167 మంది వైమానిక దళం నుండి పతకాలు సాధించిన వారిలో ఉన్నారు.

====================

కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నత స్థాయి కమిటీ వివిధ అంశాలపై లడఖ్ నాయకులతో న్యూఢిల్లీలో ఈరోజు చర్చలు జరిపింది. గత నెలలో కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్ లో చెలరేగిన హింస తర్వాత కీలక అంశాలపై చర్చలు జరపడం ఇదే తొలిసారి. అపెక్స్ బాడీ లేహ్, కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ ఈ చర్చల్లో పాల్గొన్నాయి. సమావేశం అనంతరం కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ సభ్యుడు సజ్జాద్ హుస్సేన్ కార్గిలి పాత్రికేయులతో మాట్లాడుతూ.. లడఖ్ ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించాలన్నదే గత ఆరు సంవత్సరాలుగా తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. ఈ సమస్యను ఒకటి, రెండు సమావేశాల్లో పరిష్కరించలేమని, ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని తెలియజేశారు.

====================

దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) సంసిద్ధతపై ప్రధాన ఎన్నికల అధికారుల సదస్సు న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభమయ్యింది. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ (IIIDEM)లో రెండు రోజుల పాటు జరగనున్న సదస్సుకి ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చివరిగా పూర్తయిన SIR ప్రకారం వారి సంబంధిత రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్ల సంఖ్య, చివరి SIR అర్హత తేదీ, ఓటర్ల జాబితాపై నివేదికలను ప్రదర్శించారు. ఎన్నికల నిర్వహణ సిబ్బంది నియామకం, శిక్షణా తరగతులపై కూడా ఎన్నికల సంఘం ఈ సందర్భంగా సమీక్షించింది.

====================

ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో భారతదేశం ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం అటవీ విస్తీర్ణంలో భారత్ ప్రస్తుతం 9వ స్థానానికి చేరుకుంది. ఇండోనేషియాలోని బాలి నగరంలో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (FAO) విడుదల చేసిన గ్లోబల్ ఫారెస్ట్ రిసోర్సెస్ అసెస్‌మెంట్-2025 నివేదికలో ఈ వివరాలను వెల్లడించారు. అటవీ సంరక్షణ, అడవుల పెంపకం, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఈ అద్భుతమైన పురోగతికి కారణమని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దేశ నిబద్ధతను ప్రతిబింబిస్తూ.. వార్షిక అటవీ విస్తీర్ణం పెరుగుదల పరంగా భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో కొనసాగుతుందని ఆయన తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం కూడా పౌరులందరినీ చెట్లను నాటడానికి, పచ్చదనాన్ని పెంచడానికి ప్రేరణ ఇచ్చిందని భూపేంద్ర యాదవ్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

దేశంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం గణనీయంగా పెరిగింది. 2014లో 35 గిగావాట్ల నుండి ఐదు రెట్లు పెరిగి నేడు 197 గిగావాట్లకు చేరుకుంది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర సామర్థ్యాన్ని సాధించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశ పునరుత్పాదక వృద్ధి గమనం ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంధన ప్రయాణాన్ని ఉజ్వల భవిష్యత్ ను సూచిస్తోందని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ పేర్కొంది.

====================

భారత జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్రాకు ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ హోదాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రదానం చేశారు. ఒలింపిక్స్ లో రెండు పతకాలు సాధించిన నీరజ్ చోప్రా తొలుత సుబేదార్‌గా 2016లో జాయిన్ అయ్యారు. సుబేదార్ నుంచి 2021లో మేజర్‌గా పదోన్నతి పొందారు. 2022లో 'పరమ విశిష్ట సేవా పతకం'తో కేంద్ర ప్రభుత్వం ఆయనను సత్కరించింది. ఇప్పుడు మేజర్ నుంచి లెఫ్టినెంట్ కల్నల్ గా హోదా అందుకున్నారు. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న పురస్కారాన్ని 2021లో అందుకున్న నీరజ్ చోప్రా 2022లో పద్మశ్రీ అవార్డును కూడా అందుకున్నారు.

====================

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారిందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. దీని ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణాంధ్రప్రదేశ్ లలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే తమిళనాడులో రాబోయే 48 గంటల్లో రాష్ట్రంలోని చాలా తీరప్రాంత జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త స్వర్ణాంజలి వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

మహిళల వన్డే ప్రపంచ కప్ లో భాగంగా భారత్, న్యూజ్ లాండ్ జట్ల మధ్య నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా రేపు క్రికెట్ మ్యాచ్ జరగనుంది. సెమీ ఫైనల్స్ కు చేరుకునేందుకు ఇరు జట్లకు ఈ మ్యాచ్ లో విజయం చాలా కీలకం. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మహిళా జట్లు సెమీ ఫైనల్స్ కు అర్హత సాధించగా నాల్గవ స్థానం కోసం భారత్, న్యూజ్ లాండ్ తో పాటూ శ్రీలంక కూడా పోటీ పడుతోంది. ఇక మరోవైపు పురుషుల క్రికెట్ లో ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ లో భాగంగా రెండవ మ్యాచ్ ఆడిలైడ్ వేదికగా రేపు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. తొలి మ్యాచ్ లో విజయం సాధించి ఆస్ట్రేలియా ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది.

====================
====================